క్లుప్తంగా

గురుకులం విద్యార్థులకు సంగీత శిక్షణ



సంగీత పరికరాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందురూరల్: పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలంలోని సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాలకు ప్రభుత్వం సంగీత వాయిద్యాలను సరఫరా చేసింది. వాటిని గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పరిచయం చేశారు. ఒక్కో పరికరం వల్ల వచ్చే శబ్దాలను వినిపించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు వ్యాయామం, క్రీడలు, సంగీత విభాగాలలో కూడా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సదుపాయాలు సమకూరుస్తోందని చెప్పారు. త్వరలో సంగీత శిక్షణ తరగతులు కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

నేచర్ పార్క్ సందర్శన

ఇల్లెందురూరల్: అటవీశాఖ అర్బన్ నేచర్ పార్క్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో బీజెడ్‌సీ విద్యార్థులు గురువారం సందర్శించారు. పార్క్‌లోని వివిధ రకాల మొక్కల గురించి వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు కృష్ణవేణి, అటవీశాఖ బీట్ అధికారి సుజాత విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ రాకేష్‌శ్రీరాం పాల్గొన్నారు.

చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్



టేకులపల్లి: ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ కేటీసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముచ్చా సుధాకర్ నియమితులయ్యారు. గురువారం యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సంఘం కార్యాలయంలో అసంఘటితరంగ కార్మి క సంఘం ఇల్లెందు ఇన్‌చార్జ్ గోచికొండ సత్యనారాయణ నియామకపత్రం అందజేశారు.

'కపాస్'పై అవగాహన కేంద్రం

ఇల్లెందు: పత్తి విక్రయం కోసం దళారుల బెడదను నివారించేందుకు కపాస్ కిసాన్ యాప్‌పై మార్కెట్ యార్డులో అవగాహన కేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, గ్రేడ్–3 సెక్రెటరీ నరేష్‌కుమార్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నమోదు చేసుకున్న రైతులు పత్తిని సీసీఐ కేంద్రంలో విక్రయించుకోవచ్చని చెప్పారు. సూపర్‌వైజర్ ఎస్.శ్రీనివాసరావు, లక్ష్మయ్య, రంజిత్, మధు, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ఇల్లెందురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని హాస్టల్, ఆశ్రమ పాఠశాలల వర్కర్లు 35 రోజులుగా చేపడుతున్న సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. గురువారం బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని చెప్పారు. తాళ్లూరి కృష్ణ, రామకళ, లక్ష్మణ్, స్వరూప పాల్గొన్నారు.

సమస్యలకు నిలయం పీవీకే-5

- సిబ్బంది లేరంటూ ఆదివారం మ్యాన్ రైడింగ్ బంద్
- వెంటిలేషన్, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కార్మికులు
- పద్మావతిఖని గనిలో నిబంధనలు పాటించని సింగరేణి యాజమాన్యం



గని మేనేజర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పద్మావతి ఖని (పీవీకే –5) గని సమస్యలకు నిలయంగా మారిందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గని మేనేజర్ శ్యాం ప్రసాద్‌కు పలు కార్మిక సంఘాల నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం కనిపించటం లేదని చెబుతున్నారు. ప్రధానంగా గనిలో పని ప్రాంతాల వద్ద సరైన వెంటిలేషన్ లేక కార్మికులు అస్వస్థతకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. గనిలోని సీఎమ్మార్ ప్యానెల్ వద్ద పనిచేసే కార్మికులకు అన్ని షిఫ్టులలో తాగునీరు ఏర్పాటు చేయాలని, ఆదివారం పనిచేసే కార్మికులకు రెండు మస్టర్లు ఇవ్వాల్సి వస్తుందనే నెపంతో ఆదివారం మ్యాన్ పవర్ తగ్గించే క్రమంలో మ్యాన్ రైడింగ్ లేకుండా చేస్తున్నారని, కార్మికులు సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతోపాటు మ్యాన్ రైడింగ్ వీల్స్‌కు వినియోగించే లైనర్స్ సరిపడా లేని కారణంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, సరిపడా లైనర్స్‌ను అందుబాటులో ఉంచాలని కార్మికులు కోరుతున్నారు. 10 డీప్ 112 లెవల్‌లో ఉన్న స్విచ్‌ల వద్ద రక్షణ సూత్రాలు పాటించాలని, లేదంటే స్విచ్‌లపై వాటర్ పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కార్మికులు చెబుతున్నారు. డిపార్ట్‌మెంట్ల వద్ద శిక్షణ ఇచ్చి, అనంతరం కంపెనీలో పర్మనెంట్ ఉద్యోగం పొందితే, గనుల్లోకి దింపాల్సిన యాజమాన్యం అప్రెంటిస్ అభ్యర్థులతో గనుల్లో పనులు చేయించటం చట్టవిరుద్ధం. ఈ విషయంలో యాజమాన్యాన్ని నిలదీయాల్సిన కార్మిక సంఘాలు నోరు మెదపటం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు. గనిలో రోజురోజుకు గైర్హాజరు శాతం పెరుగుతోందని, దీంతో ఉన్నవారిపై పనిభారం పడుతోందని, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. అదేవిధంగా గనిలో టెక్నీషియన్ల కొరతను నివారించాలని, అండర్ గనుల్లో పనిచేసే వారిని కంపెనీ అవసరాల రీత్యా సర్ఫేస్‌లో డ్యూటీలు చేయించుకొని, వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లను ఎగ్గొట్టటం గర్హనీయం అన్నారు. దీని వలన ప్రతీ కార్మికుడు వేతనంలో 11.25 శాతం నష్ట పోతున్నారని, ఇది 1952 కోల్‌మైన్స్ యాక్ట్‌కు విరుద్ధమని చెబుతున్నారు. ఈవిషయంలో కార్మిక సంఘాలు ఏరియా ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

గైర్హాజరుతో ఇబ్బందిగా ఉంది..



కంపెనీ నిబంధనల ప్రకారం అప్రెంటిస్ వారితో అండర్ గ్రౌండ్ పనులు చేయించి వారికి సర్టిఫికెట్ ఇస్తాము. ఇది కంపెనీ నిబంధన, గనిలో కార్మికుల గైర్హాజరు శాతం నివారణకు ఏరియా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీని వలన కొంత శాతం తగ్గే అవకాశం ఉంది.

– శ్యాంప్రసాద్, గని మేనేజర్

యాజమాన్యానికి విన్నవించాం..



కొత్తగూడెం ఏరియాలో ఉన్న ఒక్క భూగర్భగనిని కాపాడే క్రమంలో యూనియన్ అనేక సమస్యలను యాజమాన్యంతో దృష్టికి తీసుకెళ్తే పరిష్కారానికి అధికారులు సహకరించడం లేదు. సమస్యలపై వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోతోంది. ఉన్నతాధికారులు స్పందించాలి.

– ఎండీ రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

యూజీ అలవెన్స్ చెల్లించాలి..



సింగరేణి భూగర్భ గని సర్ఫేస్ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ ఇవ్వాలి. కానీ యాజమాన్యం పీవీకే–5 కార్మికులకు ఇటీవల ఇవ్వటం లేదు. ఫలితంగా ప్రతీ కార్మికుడు తన జీతంలో 11.25 నష్టపోతున్నారు. దీనిపై యాజమాన్యం ఆలోచించాలి.

– విజయగిరి శ్రీనివాస్, సీఐటీయూ కార్యదర్శి

ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ప్రభుత్వ వైద్య శాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉన్నా నేటికీ చాలామంది గర్భిణులు ప్రసవాలకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో సుక్కాలబోడు రైతు వేదికలో ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్, పోషకాహార మాసోత్సవం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి, సీడీపీఓ కేఎం తార, ఏఎంసీ చైర్మన్ బానోతు రాంబాబు, సీహెచ్‌ఓ వజ్జా పార్వతి, కోరం సురేందర్, ఉమా, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు వంటపాత్రల వితరణ

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వంటపాత్రలను వితరణ చేశారు. ఇటీవల పాఠశాలలోని వంట గది తలుపులు పగలగొట్టి వంట పాత్రలను దొంగలు ఎత్తుకెళ్లారు. జూలూరుపాడుకు చెందిన ఇడుపుల రాజు సహకారంతో ప్యూర్ ఫౌండేషన్ వారు రూ.8,000 విలువ గల వంటపాత్రలను హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్యకు అందజేశారు. అదేవిధంగా స్పెషల్ బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిరావు, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మురళీలు మాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలు, బాలకార్మికులు, బాలల అక్రమ రవాణ, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంశెట్టి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ఉమ, సూరపనేని శాంత కుమారి, నంద్రు గురుమూర్తి, పి.రామనాథం, అరుణకుమారి, ఉమామహేశ్వరి, బానోత్ సునీత, లలిత, పటేల్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్ క్రీడా పోటీలు

పాల్వంచరూరల్: సుజాతనగర్, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, చంద్రుగొండ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో ఈరోజు, రేపు జోనల్ స్థాయి క్రీడాపోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు అండర్ 14, 17 విభాగంలోని బాలురకు, రెండో రోజు శనివారం బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బొజ్జాయిగూడెంలో..

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడలు 17, 18 తేదీలలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం నాగమణి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

పాల్వంచరూరల్: పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే ప్రజల పట్ల పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ ఆర్.సతీశ్‌కుమార్ అన్నారు. కిన్నెరసాని గ్రామంలోని రూరల్ పోలీసుస్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, గార్డు పోస్టును తనిఖీ చేశారు.

చట్టాలను అమలు చేయాలి

ఇల్లెందు/ ఇల్లెందురూరల్: ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్‌లో అందజేశారు. సంఘం కార్యదర్శి ఈసాల సురేష్, జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలాల్లో ఆదివాసీలకు మాత్రమే సాదాబైనామా పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బట్ట కనకరాజు, ఈసాల రవి, పూనెం రమణబాబు, జబ్బా సుదర్శన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచరూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీవేజ్ వర్కర్లు సమస్యల పరిష్కారానికి 35 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ఐటీడీఏ అధికారులు పట్టించుకోవడం లేదని వెంటనే కార్మికుల సమ్మలను పరిష్కరించాలని నంగార బేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు కుశనాయక్ డిమాండ్ చేశారు. ఉల్వనూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఎదుట సమ్మె చేస్తున్న సమ్మె శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల పర్మనెంట్ స్కేల్ ఇవ్వాల డిమాండ్ చేశారు.

వీకే–ఓపెన్ కాస్ట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో నూతనంగా ప్రారంభం కానున్న వీకే–7 ఓపెన్ కాస్ట్ బొగ్గు వెలికితీత పనులను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఉద్యమాలు తప్పవని, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలని సింగరేణి గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం పీవీకే–5 మైన్‌లో జరిగిన పిట్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రైవేటీకరణ అంటే మక్కువ అని, ప్రజలకు చెందాల్సిన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని దీనిని కార్మిక వర్గం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నూతన భూగర్భగనుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం శాలేం రాజుతో కలిసి పలు సమస్యలపై చర్చించారు.

ఉద్యోగులు తిరిగి సొంత జిల్లాకు కేటాయింపు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వివిధ ప్రాంతాలలో పని చేస్తున్న ఎఫ్‌డీహెచ్‌ఎస్ 104 ఉద్యోగులు 23 మంది బదిలీపై ఖమ్మం మెడికల్ కాలేజీకి వెళ్లగా వారిని తిరిగి సొంత జిల్లాకి తీసుకురావడానికి కృషి చేసిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషాకు గురువారం ఉద్యోగులంతా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో గురువారం 68 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.33.68లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సీపీఐలో చేరిక... సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సుజాతనగర్ మండలం, సింగభూపాలెం గ్రామానికి చెందిన 60 కుటుంబాలు గురువారం సీపీఐలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూనంనేని మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా వందేళ్లుగా ప్రజలు సీపీఐని ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, భూక్యా దస్రు, కంచర్ల జమలయ్య, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, పాదిల శ్రీనివాస్, ఎండి యూసుఫ్, మూడు గణేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం..



చుంచుపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

ఇల్లెందు: సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరమివేయాలని డీఎస్పీ చంద్రభాను కోరారు. గురువారం పోలీసులు, విద్యార్థులతో కలిసి పట్టణంలోని గోవింద్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలని సూచించారు. యువత, విద్యార్థులను చెడుమార్గం నుంచి గట్టెక్కించేలా సమష్టిగా కృషి చేయాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మండల రాము, కృష్ణప్రసాద్, పూనెం సురేందర్, మడుగు సాంబమూర్తి, జాఫర్, సీఐలు టి.సురేష్, సత్యనారాయణ, రవీందర్ తదిరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: అందరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని చుంచుపల్లి ఎస్సై రవికుమార్ అన్నారు. గురువారం చుంచుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులను గమనించి అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ: యువత డ్రగ్స్‌కు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కేటీపీఎస్ ఎ కాలనీలో చైతన్యం – డ్రగ్స్‌పై యుద్ధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుమన్, శ్రీనివాస్, సీతారామయ్య, ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీరా, కేటీపీఎస్ డీఈ మంగీలాల్, కాలనీవాసులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అందరూ కలిసి రావాలి...

కొత్తగూడెంటౌన్: డ్రగ్స్ నిర్మూలనా యుద్ధంలో అందరూ కలిసి రావాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి ప్రయాణికులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణాను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని తెలిపారు. సీఐలు ఎం.కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

పాల్వంచ: పాల్వంచ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చింతోజు బ్రహ్మారావు, ఎండి.షహాబుద్దీన్‌ఖాన్ నియామకయ్యారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫైనాన్స్ సెక్రటరీగా టి.కన్నయ్య, అసిసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కె.జానీవియా, వైస్ ప్రెసిడెంట్‌గా వి.మురళీ, బి.జయమ్మ, జాయింట్ సెక్రటరీగా జె.భిక్షమయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.రాంబాయి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎ.సురేందర్‌రావు, జిల్లా కౌన్సిలర్లుగా బి.వెంకటేశ్వరరావు, వై.గోవిందరావు, జె.ఆనందరావులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.

ఏసీపీ విష్ణుమూర్తి మృతికి సంతాపం



విష్ణుమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేగా కాంతారావు

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామ వాసి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న సబ్బతి విష్ణుమూర్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. స్వగ్రామంలో గురువారం ఆయన దశదినకర్మ నిర్వహించగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, వివిధ పార్టీల నాయకులు ఎస్.కే.సాబీర్‌పాషా, చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్, దుద్దుకూరి మధుసూధన్‌రావు, యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, కృష్ణమూర్తి, తహసీల్దార్ టి.శ్రీనివాస్, సీఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి

బీసీ బంద్‌కు బీఆర్‌ఎస్ మద్దతు

ఇల్లెందు: 18న జరగనున్న బీసీ బంద్‌కు రాజకీయ పార్టీలు, కుల సంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. గురువారం ఇల్లెందులో బీఆర్‌ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ మద్దతు ప్రకటించారు. ఇల్లెందులోని తన కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ సాధించుకునే తరుణంలో అన్ని సంఘాలు, పార్టీలు ఐక్యం వావాలన్నారు. బీసీ బంద్‌కు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్.రంగనాథ్, అబ్దుల్ నబీ, వాసు, కృష్ణయ్య, సన రాజేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బంద్‌కు సీపీఎం, సీపీఐ, ఎన్డీ, సీపీఐ అనుబంధ ఇన్సాఫ్ కమిటీ, టీడీపీ, తుడుందెబ్బ పార్టీలు మద్దతు ప్రకటించాయి.

సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ మోసం చేయబోయిందని, సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్ నాయక్, ఖమ్మంపాటి రేణుక, శీలం రమేష్, ప్రమోద్‌కుమార్, పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని 9వ షెడ్యూల్‌లో కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ధనలక్ష్మి, టి.లలితశారద, కటకం పద్మావతి పాల్గొన్నారు.

టేకులపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీ సంఘాలు, నాయకులు, యువతీ, యువకులు ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పిలుపునిచ్చారు. గురువారం మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధనకు 18న బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ను జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా బీసీ సంఘాల రాష్ట్ర బంద్‌ను పకడ్బందీగా నిర్వహించి బీసీల సత్తా చాటాలని మండల బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని కందస్వామి కాంప్లెక్స్‌లో సంఘాల నాయకులు సమావేశమై చర్చించారు. నర్సింగ్ లక్ష్మయ్య, తాడోజు భిక్షమయ్య, ధర్మపురి వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.



ఇల్లెందు: మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన బీసీ జేఏసీ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ముస్లిం మైనార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గురువారం రామవరం ఈద్గా ఖబరస్తాన్ కమిటీ అధ్యక్షుడు ఫహీమ్ దాదా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు రావాలన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని బీసీ సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ కొదుమూరి సత్యనారాయణ విమర్శించారు. జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా బీసీ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించడంలో విఫలమైందన్నారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. కొడగాని శ్రీనివాస్ యాదవ్, పితాని సత్యనారాయణ, కురిమెళ్ల శంకర్, పామర్తి అంకినీడు ప్రసాద్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

బిల్లును అడ్డుకుంటున్న మోదీ

పాల్వంచ: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని, రిజర్వేషన్లపై రాజకీయం సరైంది కాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం స్థానిక సీఆర్ భవన్‌లో ప్రజా సంఘాల నాయకులతో ఈ నెల 18న జరగనున్న బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందన్నారు. బీసీ బంద్‌ను సీపీఐ సంపూర్ణంగా బలపరుస్తుందని తెలిపారు. సమావేశంలో అడుసుమల్లి సాయిబాబా, గుండాల నాగరాజు, వి.పద్మజ, డి.సుధాకర్ పాల్గొన్నారు.

జనావాసంలో మున్సిపల్ చెత్త డంప్

- డంప్ యార్డును వదిలేసి ఇళ్ల మధ్య చెత్త కుప్పలు వేస్తున్న వైనం
- గురుకులం– లలితాపురం– జేకే ఓసీ మధ్య దుర్గంధం
- మున్సిపల్ కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు



జనావాసాల మధ్య డంప్ చేసిన చెత్త



చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న స్థానికులు (ఫైల్)

ఇల్లెందు: మున్సిపల్ చెత్త డంప్ యార్డుకు తరలించకుండా గిరిజన గురుకులం – లలితాపురం– జేకే ఓసీ మధ్య డంప్ చేస్తున్నారు. మంగళవారం గురుకులం సమీప ప్రజలు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను కలిసి శానిటేషన్ సిబ్బంది తీరుపై ఫిర్యాదు చేశారు. ఏడాదిగా చెత్త వేయొద్దని అడ్డుకుంటున్నారు. అయినా సింగరేణి అధికారులు అనుమతి ఇచ్చినట్లు బుకాయిస్తూ చెత్త తెచ్చి ఇక్కడే వేస్తున్నారు. పట్టణంలోని సగం వార్డుల నుంచి కొత్త కాలనీ ఏరియా నుంచి వెలువడే చెత్తను మున్సిపల్ ట్రాక్టర్ల ద్వారా తెచ్చి పురాతన అసంపూర్తిగా వదిలేసిన ఇందిరమ్మ ఇళ్ల మధ్యలో వదిలేస్తున్నారు.

ఆ తర్వాత ఆ చెత్తను ఏరుకునే వారు తగులబెడుతున్నారు. చెత్తలో ఉండే ప్లాస్టిక్, వ్యర్థ్యాలు తగులబడి పొగ వెదజల్లుతోంది. ఆ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు అనారోగ్యం బారిన పడుతున్నారు. శ్వాససంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. వందలాది ట్రాక్టర్ల చెత్తను తెచ్చి జనావాసాల మధ్య వదిలేయడంతో ఆ చెత్తలో మృతి చెందిన కుక్కలు, కోతులు, కోళ్లు, పందికొక్కులు, ఎలుకలు, పిల్లులు ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంవత్సరం నుంచి చెత్త ట్రాక్టర్లను అడ్డుకుంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. మున్సిపాలిటీకి డంప్ యార్డు ఉన్నా గురుకులం సమీపంలో వదిలేసి వెళ్లటం వల్ల స్థానికులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనారోగ్యం బారిన పడుతున్నాం..



గిరిజన గురుకులం వద్ద ఖాళీ ప్రదేశంలో మున్సిపల్ చెత్త వదిలేయం వల్ల స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. చెత్త తగలబడి కాలుష్యంతో ఊపిరితిత్తుల, శ్వాస సమస్యలు వస్తున్నాయి. మున్సిపల్ డంప్ యార్డు ఉన్నా అక్కడికి తరలించకుండా గురుకులం సమీపంలో డంప్ చేస్తున్నారు.

– మావునూరి రాజు, గురుకులం ఏరియా

జంతు కళేబరాలు ఉంటున్నాయి..



మున్సిపాలిటీ సిబ్బంది చెత్త తెచ్చి లలితాపురం – గురుకులం జేకే ఓసీ మధ్య ఖాళీ ప్రదేశంలో వేస్తున్నారు. అందులో మృతి చెందిన కుక్కలు, కోళ్లు, పందికొక్కులు, ఎలుకలు, కోతుల కళేబరాలు ఉంటున్నాయి. వాటివల్ల భరించలేని దుర్గంధం వస్తోంది. చెత్తను మున్సిపల్ డంప్ యార్డుకు తరలించాలి.

– జోగ రమేష్, లలితాపురం